క్లుప్తంగా

వినతులను పరిష్కరించండి



రెవెన్యూ వినతులను పరిశీలిస్తున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రీవెన్స్ డే రోజున నిర్వహించే ప్రజాసమస్యల ప్రజావేదిక, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను పరిష్కరించాలని తహసీల్దార్ సుబ్రమణ్యం ఆదేశించారు. గురువారం ఆయన కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారుల పనితీరు బాగోలేదని, వారు పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని, వచ్చిన వినతులను విచారించి వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. భూసమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే ఊరుకోనని హెచ్చరించారు. ఆర్‌ఐ నల్లయ్య, మండల సర్వేయరు ప్రకాష్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే జైలు శిక్ష



ప్రచారం చేస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ప్రోత్సహించినా, చేసినా జైలుశిక్ష తప్పదని మహిళ ఎస్‌ఐ లక్ష్మి తెలిపారు. గురువారం మహిళా పోలీస్ టీమ్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, బాల్యవివాహాలపై ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రతిఒక్కరూ అడ్డుకోవాలని కోరారు. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. హెడ్‌కానిస్టేబుల్ శారద, కానిస్టేబుల్ ఎల్లమ్మ పాల్గొన్నారు.

అన్నదానం



కనమనంబేడులో అన్నదానం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామస్తులు గురువారం శివరాత్రి పురస్కరించుకుని 300 మందికి అన్నదానం చేశారు. వినాయక ఆలయంలో వినాయకుడికి అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలను భక్తులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. భారీసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



గుంటిపేడులో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కేవీబీపురం(వరదయ్యపాళెం): కేవీబీపురం మండలంలోని కండ్లూరు, గుంటిపేడు గ్రామాల్లో తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో గురువారం కోవనూరు పీహెచ్‌సీ పరిధిలోని కండ్లూరు, గుంటిపేడు గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్ పరీక్షలు చేశారు. స్వచ్ఛందంగా మహిళలు, పురుషులు పరీక్షలు చేయించుకున్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి జగదీష్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు హరిత, పద్మావతి, సర్పంచ్ మురళి పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణ వైభోగం

నారాయణవనం: మండలంలోని కైలాసనాథకోనలో కామాక్షాంబికా సమేత కైలాసనాథస్వామికి గురువారం కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు కైలాసనాథునికి లింగోద్భవ అభిషేకాన్ని, బిల్వార్చనలు చేశారు. గురువారం ఉదయం 10 గంటలకు అర్చకులు కామాక్షాంబికతో కైలాసనాథునికి కనులపండువగా కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించిన భక్తులకు పసుపు, కుంకుమ అందజేశారు. అలాగే పాలమంగళంలోని పాలీశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి లింగోద్భవ అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారితో పాలీశ్వరస్వామి వృషభ వాహనం అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు.

అత్తూరులో..

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం అత్తూరులోని పార్వతీదేవి అమృత లింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం భక్త జన సందడి నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, భక్తుల శివ నామస్మరణల నడుమ వేద పండితులు హరికృష్ణ శర్మ, దండపాణి గురుకుల్ ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, వివిధ ఆభరణాలు, విశేష పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి, కళ్యాణ వేదికపై కొలువుదీర్చారు. అనంతరం కనుల పండువగా కళ్యాణోత్సవం నిర్వహించారు. దీనికి ఉభయదారులు తిరుపతికి చెందిన నిర్మల ఆనంద్ రెడ్డి దంపతులు స్వామి, అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. కళ్యాణోత్సవం అనంతరం అనంతరం ఆలయ కమిటీ భక్తులకు అన్నప్రసాద వితరణ చేసింది. కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

సత్యవేడు: స్థానిక అటవీ అభివృద్ధి సంస్థం ప్రాంగణంలో శ్రీవనరాలజ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో విశాలాక్షి వ్విశ్వనాథస్వామి వార్ల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. మూడు రోజులుగా నిర్వహించిన మహాశివరాత్రి ఉత్సవాలు గురువారం కల్యాణోత్సవంతో ముగిశాయి. చివరిరోజు విశాలాక్షి విశ్వనాథస్వామికి మంగళ వాయిద్యాలు, భక్తుల శివనామ స్మరణ మధ్య తిరుచానూరు త్యాగరాజ గురుకల్ ఆధ్వర్యంలోని రుత్విక్ బృందం కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ముందుగా కల్యాణ మండపంలో ప్రతిష్ఠించిన విశాలాక్షి సమేత విశ్వనాథస్వామి వారి ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించి పూలతో అలంకరించారు. ఉదయం 10.30 కల్యాణోత్సవం పూజాక్రతువు నిర్వహించారు. ఫారెస్టు అధికారులు అమ్మవారికి సారె తీసుకొచ్చారు. విశాలాక్షి అమ్మవారికి విశ్వనాథస్వామి మాంగల్య ధారణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు.



నారాయణవనం: కైలాసనాథస్వామికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



నారాయణవనం: వృషభ వాహనంపై పాలీశ్వరస్వామి




రేణిగుంట మండలం అత్తూరులో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు



సత్యవేడు : కల్యాణోత్సవం నిర్వహిస్తున్న గురుకుల్ బృందం

శివ శివా.. ఇదేమి అపచారం?



శ్రీకాళహస్తి: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తి ఆలయ సమీపంలో అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదాస్పదమైంది. త్రినేత్రుడిగా పేరున్న శివయ్యకు మూడు కళ్లు ఉంటాయని భక్తులందరికీ తెలుసు. కానీ శ్రీకాళహస్తిలో ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో మూడు చేతులు, మూడు కాళ్లతో శివయ్య చిత్రాన్ని ఏర్పాటు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ చిత్రం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆలయ అధికారులు తొలగించారు.

'మరుగు' బాధలేల శివ..శివా..!




ఆలయం వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయ ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లతో ఇబ్బందులు తప్పడం లేదు శివ..శివా! అని భక్తులు వాపోతున్నారు. ప్రధానంగా అక్కడ లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రిపూట భక్తులు ఆందోళన చెందుతున్నారు. అంతే కాకుండా నీరు కూడా కొంత సమయం అందకపోతూ ఉండడంతో వారి బాధ వర్ణనాతీతం. అధికారులు ఈ సమస్యలపై దృష్టి సారించాల్సి ఉంది.

హంస వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరుడు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్ పురంలోని తిరుమల-తిరుపతి దేవస్థాన అనుబంధ శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఉభయదేవేరులతో స్వామి వారు హంసవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం సుప్రభాతం సేవతో స్వామి అమ్మవారిని మేల్కొల్పారు. అనంతరం భక్తులకు స్వామి అమ్మవార్లు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులను ఆలయంలో నుంచి తీసుకువచ్చి అభిషేక మండపంలో వందలాది మంది భక్తుల నడుమ ఉత్సవాలకు అభిషేకం, అలంకారం చేశారు. సాయంత్రం ఉయ్యాలసేవ నిర్వహించారు. రాత్రి హంస వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆశీనులై విహరించారు. సంగీత సాహిత్య కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ అధికారులు ఆనంద్, రవి కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



హంసవాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

మార్కెట్ల వేలం పారదర్శకంగా నిర్వహించండి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మేజర్ పంచాయతీ వారపు సంత, కూరగాయల మార్కెట్, గేటు వసూలు, పంచాయతీ రూములకు శుక్రవారం నిర్వహించనున్న వేలాన్ని పారదర్శకంగా నిర్వహించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి మణికి గురువారం సీపీఐ సీనియర్ నేత తులసిరాజన్ వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లొంగకుండా వేలాన్ని స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించాలని, ఎవరినీ కట్టడి చేయరాదని విజ్ఞప్తి చేశారు. అయితే ఇప్పటి వరకు మార్కెట్ల వేలానికి సంబంధించి పట్టణంలో ఎలాంటి దండోరా వేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికే పట్టణ పోలీసులు ఆశా వాహుల వద్దకు వెళ్లి వేలంలో పాల్గొంటే సమస్యలు తప్పవని హెచ్చరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

నేడు సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలు

నాగలాపురం: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 28వ తేదీ శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరత్నమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు కులధ్రువీకరణ, ఆదాయపత్రాలు, బ్యాంకు పాసు పుస్తకం, సంబంధించిన పత్రాలు తీసుకుని ఇంటర్వ్యూకు హాజరకావాలని ఆమె కోరారు.

శాస్త్రోక్తంగా లింగోద్భవ పూజలు



పాండూరుజ్యోతీశ్వరస్వామి ఆలయంలో స్వామిఅమ్మవారు

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు జ్యోతీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం వేకువజామున లింగోద్భవ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి మహాన్యాస పూర్వక అర్చన, బిల్వార్చన, లింగోద్భవ పూజను వేద పండితులు మంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించారు. భక్తులు రాత్రంతా ఆలయం వద్ద జాగారణ చేశారు.

కమనీయం..ఆదిదంపతుల కల్యాణోత్సవం..



వధూవరులైన ఆదిదంపతులు

వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాత్రి 11గంటలపైన ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు రాజేంద్రప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరులను విశేష పుష్పాలతో వధూవరులుగా అలంకరించారు. అనంతరం ఎంపీపీ పద్మప్రియ, దామోదర్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనులపండువగా చేశారు. ఆది దంపతుల కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలైన సంఘటన గురువారం రేణిగుంట మండలంలో చోటుచేసుకుంది. గాజులమండ్యం పోలీసుల కథనం..వెంకటగిరి చెందిన నాగరాజు మహాశివరాత్రి సందర్భంగా ఆటోలో కుటుంబ సభ్యులతో కలిసి పుత్తూరు సమీపంలోని మూలకండ్రిగ దేవాలయానికి వెళ్లారు. గురువారం తిరుగు ప్రయాణంలో రేణిగుంట సమీపంలోని నూతన జాతీయ రహదారి కూడలి వద్ద ప్రమాదానికి గురయ్యారు. రేణిగుంట నుంచి పుత్తూరు వైపు వెళ్తున్న భారీ లారీ వీరి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ హరికృష్ణకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గాజుల మండ్యం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆటో డ్రైవర్‌ని ఆస్పత్రికి తరలించేందుకు 108 వాహనానికి ఫోన్ చేసినా ఫలితం లేకపోవడంతో స్థానిక ఆటోలో తిరుపతి రుయా హాస్పిటల్ కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మోటార్ సైక్లిస్టులకు..

కారు ఢీకొనడంతో మోటార్ సైక్లిస్టులు గాయపడిన సంఘటన రేణిగుంట-చెన్నై జాతీయ రహదారి జీవగ్రం వద్ద గురువారం చోటుచేసుకుంది. తమిళనాడు ఆరని నుంచి రేణిగుంట వైపు వస్తున్న కారు, మోటార్ సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎస్ ఆర్ పురం మండలం నల్లపల్లెకు చెందిన ప్రభాకర్ రెడ్డి, నరసింహారెడ్డికి గాయాలయ్యాయి. కారు ముందరి భాగం దెబ్బతింది. గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ కూత వేటు దూరంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడంతో హుటాహుటిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని 108లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో గాయాలై 108 వాహనం కోసం వేచి చూస్తున్న బాధితులు

నృత్యం..మంత్రముగ్ధం



చిన్నారులను సత్కరిస్తున్న గిరిధర్‌రెడ్డి

ఏర్పేడు(రేణిగుంట): మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి మండలంలోని చిందేపల్లె శ్రీ దాక్షాయిని శ్రీ పార్వతీ సమేత సిద్దేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో శ్రీకాళహస్తికి చెందిన త్రినేత్ర నాట్యాలయం గురువు సాయి దత్త శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. చిన్నారులు నేత్రానంద్, కుందన సాయి, సాయి సాహితి, హేమశ్రీ, లోహిత రెడ్డి, దీప్తిక రెడ్డి, దాన్విత రెడ్డి, నివాసిని, భూమిక, అన్విత తమ నృత్యంతో మంత్రముగ్ధుల్ని చేశారు. వీరిని ఆలయ ధర్మకర్త డాక్టర్ గంగలపూడి గిరిధర్ రెడ్డి అభినందించారు. తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.